
# దొంగ

## సన్నపల్లె చిదంబర రెడ్డి



ఆ రోజు ఏదో పని వుండి టౌనుకెళ్లాను. రాత్రి తొమ్మిది గంటల దాకా తిరిగి తిరిగి అనుకున్న పని జరక్క బేజారుకావడంతో కాస్త రిలీఫ్ కోసం సినిమా అయినా చూద్దామని థియేటర్ దగ్గరికి నడిచాను.

క్యూలో నిలబడి పడిగాపులు పడి టికెట్ కౌంటరును సమీపించేసరికి ఎవరో నన్ను పిలిచి నట్లయ్యింది. పిలిచిన వైపు చూస్తే, ఏడెనిమది మంది ఆడవారు అంతా నావైపే చూస్తూ రమ్మ న్నట్టు చేతులూపుతున్నారు.

అందరూ మా వీథిలోని అమ్మలక్కలే, ఏదో ముఖ్యమైన పని వుంటుందనుకొని క్యూ నుండి బయటికొచ్చాను.

సేద్యగాడితో బండి కట్టించుకొని మధ్యాహ్నం మ్యాట్నీకి వచ్చామని, మంచి సిని మాలుండడంతో మొదటి ఆట కూడా చూశా మని, చీకటి కావడంతో తోడెవ్వరూ దొరక్క భయంగా వుందని అందరూ నా సహాయం అర్థించారు.

అంతమంది తెలిసిన ఆడవారు నన్ను మొన గాడిగా గుర్తించి తోడు రమ్మంటుంటే ఎలా కాదనగలను? కాలరు ఎగరేసి, ఛాతీ ఉబ్బించి సరే అన్నాను. అందరూ ఎద్దుల బండి ఎక్కారు.

మా పల్లెకూ హిందూపురం టౌనుకూ రెండు మైళ్ళుంటుంది. టౌను దాటిన అర మైలుకు చిన్న లోయ లాగా చెరువు మరవ ఒకటుం ది. అందులో రాత్రిళ్లు దొంగలు కాపు కాస్తారనీ, చేతికి దొరికిన వారి నుండి డబ్బులూ, నగలే గాక కట్టుకున్న బట్టలు కూడా ఊడబెరు క్కుంటారనీ వదంతి.

అది దాటి మరో రెండు ఫర్లాంగులు ముందుకు వస్తే జావి చెట్లు, కలబంద కలగా పులగంగా పెరిగాయి. అందరూ దాన్ని కత్తాళి పొదలు అంటారు. ఆ పొదల్లో దయ్యాలు కాపురముంటూ చీకటిప్రయాణీకుల్ని గొర్రెలు, కుక్కలు, పిల్లుల రూపంలో అటకాయించి లేవి పోని ఇబ్బందులు పెట్టి ఏడిపించి ఏడు చెరువుల నీళ్ళు తాగిస్తాయని రకరకాల కథలు ప్రచారంలో వున్నాయి.

ఇప్పుడయితే మా ఊరికి మరో వైపు నూలు మిల్లు వెలసింది. టౌను నుండి మిల్లు పని వారు తరచు తిరుగుతుంటారు. కాబట్టి దొంగలు, దయ్యాల కథలు దాదాపు మరుగున పడ్తున్నాయి.


ఎంతయినా అందరూ ఆడవారు కాబట్టి భయపడ్డం సహజమే అనుకొని బండికి వెనుక భాగంలో కూర్చున్నాను.

టౌన్లో వచ్చీ పోయే వాహనాల శబ్దాలకు, హారన్ మోతలకు ఎద్దులు బెదుర్తున్నాయి. ఇష్టం వచ్చిన వైపు లాగుతున్నాయి. జీతగాడు అనుభవం లేని వాడిలాగున్నాడు. ఎద్దుల్ని కంట్రోల్ చెయ్య లేకపోతున్నాడు. గత్యంతరం లేక వాడిని తప్ప కొమ్మని నేనే నొగల మీద కూర్చున్నాను.

బండిలోని వారంతా సినిమా వాతావరణం నుండి బయటపడినట్లు లేరు. రసవత్తర ఘట్టాల గురించి చర్చించుకొంటున్నారు.

అరగంటలో టౌను దాటింది బండి. పూర్తి చీకటిగా వున్నా అలవాటున్న దారికాబట్టి బాగానే అగుపిస్తూంది.

సుమారు హనుమంతుని గుడికి వెళ్లే ఎత్తు నుండి మరవలోకి దిగబోతోంది బండి. డొంకలో చింత నిప్పుల్లా మెరుస్తున్న రెండు వెలుగులు




కనిపించాయి. పిల్లి గానీ, గుంట నక్క గానీ దారి కడ్డంగా వుండవచ్చు. వాటి కళ్ళే అలా అగుపిస్తున్నాయనుకున్నాను.

అంతలో "అటు చూడే ఏదో వెలుగు" అన్నది ఓ అక్క. ఆ మాటతో అందరి గొంతులూ కరెంటు పోయిన రేడియోల్లా మూగబోయాయి. మరుక్షణం రెండు వెలుగులు మూడు వెలుగులయ్యాయి.

"అమ్మోయ్ కొరివి దయ్యాలు" అని అరిచిందో స్త్రీ కంఠం.

ఇంకేముంది, అందరూ బిగుసుకుపోయి ఒకరి మధ్యన ఒకరు ఇరుక్కోవడానికి ప్రయత్నిస్తున్నారు. అరిగిపోయిన పది గ్రామఫోను రికార్డుల్లా వాగుతున్న వారు ఒక్కసారిగా ఆగిపోతే నాలో కూడా ఒక రకమైన భయం ప్రవేశించింది.

ఎద్దులు మాత్రం నిర్భయంగా ముందుకు పోతున్నాయి.

నిప్పుల్లాంటి మూడు వెలుగులూ దగ్గరౌతున్నాయి. వాటిని రకరకాల ఆకారాలుగా పోల్చుకోవడానికి అవస్త పడుతున్నా చీకట్లో వెలుగుల గుర్తులు తప్ప ఏ ఆకారమూ స్పష్టం కాలేదు.

మరీ దగ్గర కావడంతో అవి మూడు మానవాకారాలుగా గుర్తించి తడారిపోతున్న గొంతు సవరించుకొని "ఎందుకు తల్లీ అనవసరంగా భయపడతారు. ఎవరో నిలబడి బీడీలు కాలుస్తున్నారు" అని నేను చెప్పబోయేంతలో

"అయ్యయ్యో దొంగలు" అంటూ గుసగుసలాడిందో కంఠం.

"ఔనమ్మా! ముగ్గురు దొంగలు" భయంతో బిగుసుకుపోతూ వంత పలకిందింకో స్వరం.

"దొంగలు కాదు, దయ్యాలు కావు, ఎవరో సైకిళ్లు నిలబెట్టి మాట్లాడుకుంటున్నారు" అని గట్టిగా అనబోయి- వారు ఎలాంటి కదలికా లేకుండా ఎలుక మీద పడబోయే మార్జాలంలా సన్నద్ధులయినట్లు అగుపించడంతో - దొంగలు కాకపోయినా నా మాటల వల్ల భయాన్ని పసిగట్టి దోపిడీకి పూనుకోవచ్చు గదా!! అనే అనుమానం కలిగి మారు మాట్లాడకుండా ఎద్దుల మీద చెరో దెబ్బ వేసి నా ధైర్యాన్ని ప్రకటించాను. క్షణంలో బండి మరువ గట్టు దాటింది.

సైకిళ్ళు బండిని క్రాస్ చేసి ముందుకు దూసుకుపోయాయి.

హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నానో లేదో "బండిని తరమండి. దొంగ ఇటే వస్తున్నాడు" అంటూ ఆడ కంఠాలన్నీ ఒక్కసారిగా అరవసాగాయి.

వెనక్కు తిరిగి చూశాను.

విరబోసుకున్న జులపాలతో నల్లగా తారు డ్రమ్ములా వున్న ఓ ఆకారం బండి వెనకాలే పరిగెత్తుకు వస్తూ వుంది.

'ఈ రోజు ఏదో విపత్తు మూడింది. అనవసరంగా వీరి కంట పడ్డాను గదరా తండ్రీ' అని నాలో నేనే మథనపడుతూ ములుకోలు తెగిపోయేలా, చర్మం చీరేలా ఎద్దులనుబాదసాగాను. నాలుగు కాళ్ళు జాడించిన ఎద్దులు గుర్రాల్లా గ్యాలప్ నందుకున్నాయి.

బండి ఎంత జోరుగా పరిగెత్తుతున్నదో వాడంత స్పీడుగా వెంబడిస్తూ వెనకాల కూర్చున్న వారిని అందుకొనేలా వస్తున్నాడు. నా వెనకాల కూర్చున్న సేద్యగాడికి పై ప్రాణం పైనే పోయినట్లుంది. నా పక్కన దూరి కోతి పిల్లలా అతుక్కున్నాడు.

అప్పుడే ప్రాణాలు పోయిన శవాల్లా ఊపిరి పీల్చడం కూడా మరిచిపోయిన ఆడవారు తమ మెడలోని సొమ్ములు కనపడనీకుండా కొంగులు చుట్టుకొని బండి పలకల అంచులకు ఒదిగిపోయారు.

అటు వెనక్కు చూడ్డం ఇటు ఎద్దుల్ని తరమడం నా వంతయ్యింది.

ఊరు వచ్చేసింది. ఇప్పటికయినా దొంగాడు వెను దిరుగుతాడేమో అని ఆశించాను గాని, వాడు నన్ను నిరాశకు గురి చేసి మరీ దగ్గరయ్యాడు.

నాకు ఎక్కడలేని ఆవేశం, ధైర్యం, కోపం వగయిరాలు ముంచుకొచ్చాయి. బుసలుకొడుతూ పరుగుదీస్తున్న ఎద్దుల నాపి నొగల మీది నుంచి ఒక్క ఉదుటను క్రిందికి దూకాను.

అప్పటికే ఒక్కొక్క స్త్రీ మూర్తి రుద్రకాళిలా విజృంభించి దొంగకు తాట ఒలుస్తున్నారు. నా దెబ్బల తడాఖా కూడా చూపిస్తామని దొంగను సమీపించాను.

అంతలో దొంగ పెట్టిన హాహాకార ఆర్తనాదాలు విన్ని ఊరి జనాభా అంతా అక్కడ చేరింది.

ఎవరో దొంగ ముఖంపై టార్చి లైటు వేశారు. దెబ్బలకు తలకాయ బుడిపెలు కట్టింది. బట్టలన్నీ చిరిగిపోయాయి. అస్తమా పేషంటులా ఆయాసపడుతూ మాట్లాడలేక నీరు కావాలని సైగ చేశాడు.

అంతలో ఒకరు "నువ్వ్రటా రామక్రిష్ణా" అంటూ గుంపును పక్కకు జరిపి దొంగగాడ్ని లేవదీసి, అతగాడు కరణంగారి కాబోయే అల్లుడు, పొద్దుననగా అనంతపురం నుండి వచ్చి సాయంత్రం సినిమాకని టౌను కెళ్ళి వస్తున్నాడు.

అప్పటికే నాలోని వీరావేశం తగ్గిపోయింది.

ఎవరో తెచ్చిన చెంబుడు నీళ్ళు గడగడ తాగిన రామక్రిష్ణ కాస్త తేరుకొని "సినిమా చూశాక ఒక్కణ్ణే ఊరికి రాలేక టౌను చివర్లో నిలబడ్డాననీ, ఎవరో సైకిళ్ళపై వస్తుంటే లిఫ్ట్ అడిగి సగం దారి దాకా వస్తూనే చక్రంలో గాలి తగ్గితే, తనను వారక్కడే వదిలేసి వెళ్ళిపోయారనీ చెబుతున్నాడు.

అంతలో అటుగా వచ్చిన బండిని ఎక్కుదామంటే బండి పరుగులుతీసిందనీ, గత్యంతరం లేక భయంతో తాను కూడా బండిని వెంబడించాననీ, ముక్కుతూ మూల్గుతూ వివరించసాగాడు.

అప్పటికే ఆడవారందరూ అక్కణ్ణుంచీ అదృశ్యమయ్యారు. నేనొక్కణ్ణే దొరికితే కరణం కనకయ్య నుంచీ ఎలాంటి ఆగ్రహానికి గురి కావలసి వస్తుందోనని మెల్లగా నేనూ జారుకున్నాను.